# ప్రాణం తీస్తున్న.. గుడుంబా







- వ్యవసాయ బావుల వద్దే పొయ్యిలు
- కుటీర పరిశ్రమగా మారిన వైనం
- కార్లు, గూడ్స్ వాహనాల్లో నల్లబెల్లం, పటిక తరలింపు
- చీకటి పడితే చాలు భారీగా ముడిసరుకు చేరవేత
- తెల్లారగానే బాటిళ్లలో తరలింపు
- మహిళలు, టీనేజర్ల ద్వారా విక్రయం

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా పరిధిలోని ఏజెన్సీ ప్రాంత పచ్చని పల్లెల్లో గుడుంబా గుప్పుమంటోంది. పల్లెల్లో నాటుసారా తయారీ ఓ కుటీర పరిశ్రమగా మారింది. తొర్రూరు డివిజన్ కేంద్రానికి సమీపంలోని అనేక గ్రామాల్లో పోలీసుల నిఘా అంతంత మాత్రంగానే ఉండడంతో గుడుంబా తయారీ దారులు రెచ్చిపోతున్నారు. దీనికితోడు నిఘా కళ్లు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో వారి వ్యాపారం 'మూడు పువ్వులు ఆరు కాయలు' అన్న చందంగా వర్ధిల్లుతోంది.

## పట్టపగలే..

సూర్యుడు హస్తమించగానే గ్రామాల్లోకి కార్లు, గూడ్స్ వాహనాల జోరు సాగుతోంది. చీకటి పడగానే నిత్యం వివిధ వాహనాల్లో గుడుంబా తయారీ కావాల్సిన నల్లబెల్లం, పటికతో పాటు యూరియా, అమోనియా, నాగస్వరం బిల్లలు, టాబ్లెట్స్ ను పెద్దఎత్తున తరలిస్తున్నారు. నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలపై కూడా ముడి సరుకుల రవాణా అవుతున్నట్లు స్థానికులు చెప్పుకొంటున్నారు. ఇదివరకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన కొందరు నిందితులే సదరు సరుకులను గుడుంబా తయారీదారులకు చేరవేస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. గుడుంబా తయారీ దారులు పగటిపూట ఎలాంటి జంకు లేకుండా తమ వ్యవసాయ బావుల వద్ద సారా బట్టీలు ఏర్పాటు చేసి నిర్విరామంగా తయారీని కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరికొందరైతే తెల్లవారుజామున తమ ఇంటి వద్దే నాటు సారా కాస్తున్నారని చెబుతున్నారు.

## మహిళలే విక్రయదారులు..

ఎవరికీ అనుమానం రాకుండా తాము తయారు చేసిన గుడుంబాను బాటిళ్లలో నింపి లగేజీ బ్యాగులల్లో పెట్టి గ్రామాల నుంచి తొర్రూరు మండల కేంద్రానికి అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ బ్యాగుల తరలింపులో అధికంగా మహిళలే పాల్గొనడం గమనార్హం. మహిళలను పెద్దగా పోలీసులు పట్టించుకోరన్న నమ్మకంతో ఈ వ్యాపారాన్ని వారి ద్వారానే నిర్వహిస్తున్నారు. అప్పుడప్పుడు వృద్ధులు, టీనేజర్లకూడా విక్రయాల్లో పాల్గొంటున్నారు.

## కొరవడిన నిఘా..

తొర్రూరు పట్టణ కేంద్రంలో విరివిగా నాటుసారా అమ్ముతున్నా అధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బహిరంగంగానే గుడుంబా విక్రయాలు సాగుతున్నా ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక మహిళలు ఆరోపిస్తున్నారు. వారి ఉదాసీనత వల్లే గుడుంబా తయారీ, విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని విమర్శిస్తున్నారు. ప్రభుత్వం సీరియస్ గా వ్యవహరించినపుడు దాడులను నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు ఆ తర్వాత చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఎవరైతే ముడుపులు చెల్లించరో వారిపై దాడులు కొనసాగిస్తూ ఉద్యోగ భక్తి చాటుకున్నారన్న విమర్శలున్నాయి. అధికారుల నిఘా కొరవడడంతోనే తొర్రూరు పరిసరాల్లో అడ్డూ, అదుపు లేకుండా నాటు సారా తయారు చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా పల్లెల్లో ఎక్సైజ్ అధికారులు మామూళ్ల కోసం కాకుండా గుడుంబాను అరికట్టి చిన్న వయసులోనే వితంతువులుగా మారుతున్న ఆడపడుచులకు అండగా నిలువాలని స్థానికులు కోరుతున్నారు.

# సర్వీస్ రివాల్వార్ తో కాల్చుకొని ఎస్సై హరీష్ ఆత్మహత్య

- వాజేడులో ఘటన
- రేగొండ మండలం వెంకటేశ్వర్లపల్లిలో విషాదం



**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లా వాజేడు పోలీస్ స్టేషన్ లో విధులు నిరహిస్తున్న ఎస్సై రుద్రారపు హరీష్ (30) తన సర్వీస్ రివాల్వార్ తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన ముళ్లకట్ట సమీపంలోని రిసార్ట్ లో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన హరీష్ 2018 లో ఎస్సై ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఆరు సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో పని చేసిన హరీష్ ప్రస్తుతం ములుగు జిల్లా వాజేడు పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కుటుంబ సభ్యులు హరీష్ కి పెళ్లి సంబంధం చూసారు. అబ్బాయి–అమ్మాయి ఇద్దరూ ఇష్టపడటంతో కుటుంబం సభ్యులు ఈ నెలలోనే ఎంగేజ్ మెంట్ కి సైతం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆత్మహత్యం చేసుకోవడం అటు కుటుంబ సభ్యులతోపాటు ఇటు పోలీస్ శాఖలో కలకలం సృష్టించింది. ఏటూరునాగారం అడవుల్లో ఆదివారం భారీ ఎన్ కౌంటర్ జరుగగా సోమవారం తెల్లవారే సమయానికి రిసార్ట్ లో ఎస్సై ఆత్మహత్య చేసుకోవడాన్ని పోలీసులు సీరియస్ గా తీసుకున్నారు. అయితే ఆత్మహత్య చేసుకున్న హరీష్ మృతదేహంపై పడి రోదిస్తూ కనిపించిన ఓ యువతిని పోలీసులు అదుపులోకి విచారిస్తున్నారు. ములుగు జిల్లా ఎస్పీ శభరీష్ సంఘటన స్థలాన్ని నిశితంగా పరిశీలించారు. అయితే ఎస్సై ఆత్మహత్య చేసుకున్న సమయంలో ఆయనతో పాటు ఒక యువతి ఉండటాన్ని బట్టి చూస్తే ప్రేమ వ్యవహారమే ఆయన ఆత్మహత్యకు కారణంగా పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. హరీష్ మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ములుగు సివిల్ ఆసుపత్రికి తరలించారు. కొడుకు మృతిని చూసి తట్టుకోలేక ఆ కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంట తడి పెట్టించింది.



# నలుగురికి డాక్టర్ రత్న అవార్డులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆసియా బెస్ట్ హెల్త్ కేర్ జాతీయ అవార్డుల ప్రధాన కార్యక్రమాన్ని ముంబైలో ఘనంగా నిర్వహించారు. వివిధ స్పెషాలిటీలలో 250కి పైగా నామినేషన్లు రాగా అందులో 61 మంది సభ్యులు మాత్రమే అవార్డులను అందుకున్నారు. అందులో వరంగల్ ప్రాంతానికి చెందిన నలుగురు పీడియాట్రిక్ స్పెషాలిస్టులు డాక్టర్ రత్న అవార్డును గెలుచుకున్నారు. కల్యాణి హాస్పిటల్ పీడియాట్రిక్స్ డాక్టర్ రమేష్, గ్రావిడ్ హోమ్ హాస్పిటల్ పీడియాట్రిక్స్ డాక్టర్ జె.ప్రదీప్, డాల్ఫిన్ హాస్పిటల్స్ పీడియాట్రిక్స్ డాక్టర్ కె.సురేష్ కుమార్, భూపాలపల్లి శిశువైద్యుడు డాక్టర్ రామాంజనేయులు ఈ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా క్లిష్టమైన కేసులకు నైపుణ్యంతో చికిత్స అందించిన పీడియాట్రిషియన్‌లను హెల్త్‌వ్యూస్ మ్యాగజైన్ సీఈఓ దీప్తి వర్మ అభినందించారు.

# దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు

- అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా మంత్రి సీతక్క శుభాకాంక్షలు



**tవరంగల్ వాయిస్, వరంగల్ :** మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని దివ్యాంగులకు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అంతా చేయూత నివ్వాలని పిలుపు నిచ్చారు. ప్రతిభావంతులు ఏ రంగంలో ఉన్నా వారిని ప్రోత్సహించాలని కోరారు. అంగ వైకల్యంతో కుమిలిపోవాల్సిన అవసరం లేదని, తెలంగాణ ప్రభుత్వం వారికి అండగా ఉంటుందన్నారు. దివ్యాంగులు ఆత్మస్త్రైర్యంతో ముందడుగు వేస్తే సాధించలేనిది ఏమీ లేదని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్ర స్థానంలో ఉందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం అందుకుని దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని సీతక్క కోరారు.